
సాక్షి
బాపట్ల
మంగళవారం । 5 । నవంబర్ । 2024



వెండి రాజ మకుటం వితరణ

కొల్లూరు(వేమూరు): కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామికి చందు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సోమవారం మూడు కిలోల వెండి రాజమకుటం వితరణ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,767 క్యూసెక్కులు వదిలారు.

వెండి నేత్రాలు సమర్పణ



సత్రశాల(రెంటచింతల): సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారికి జెట్టిపాలెం గ్రామానికి చెందిన జరావత్ మునినాయక్, కవిత దంపతులు వెండి నేత్రాలు సమర్పించారు.

అక్రమాలలో అగ్రపథం!

- ఇచ్చిన హామీలు గాలికి..
- ఎన్నికలవేళ సూపర్ సిక్స్ అంటూ వంచన
- అధికారంలోకి వచ్చాక అక్రమాలకు సై
- అక్రమంగా ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్ అమ్మకాలు
- విజృంభిస్తున్న రేషన్ మాఫియా
- బెల్టుషాపులతోపాటు పేకాట, కోడిపందేల జోరు
- తీరంలో టోల్‌గేట్లు పెట్టి డబ్బులు వసూళ్లు
- పతాకస్థాయికి పచ్చనేతల అక్రమాలు
- నేడు జిల్లా తొలి సమీక్ష మండలి సమావేశం

జిల్లాలో అభివృద్ధికి మంగళం.. అవినీతికి అందలం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకు బాపట్ల జిల్లా తొలి సమీక్ష మండలి సమావేశం మంగళవారం జరగనుంది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారధి ఆధ్వర్యంలో జరగనుంది. జిల్లాకు చెందిన మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు మిగిలిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొననున్నారు. జిల్లాలో అభివృద్ధి అజెండాతో సమావేశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చక వంచించడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు చంద్రబాబు పాలనలో జిల్లాలో టీడీపీ నేతల అవినీతి, అక్రమాలు పతాకస్థాయికి చేరాయి. కొందరు ఎమ్మెల్యేలు ఉన్న వనరులను దోచుకుతింటూ అటు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

పర్యాటకుల 'టోల్' తీసే కుట్ర..

బాపట్ల నియోజకవర్గంలోనూ తీరప్రాంతాన్ని అడ్డుపెట్టి పచ్చనేతలు తాజాగా లోట్‌గేట్లు పెట్టి పర్యాటకుల నుంచి వసూళ్లకు దిగారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో అక్రమ రిసార్టులు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. పర్యాటక శాఖ అనుమతులతో పనిలేకుండా పచ్చనేతలు మామూళ్లు పుచ్చుకొని అనధికార అనుమతులు ఇస్తున్నారు. అక్రమ లేఅవుట్ల వ్యాపారం ఇక్కడి ముఖ్యనేతకు ఆదాయవనరుగా మారింది. నియోజకవర్గంలో ఇసుక వ్యాపారం జోరందుకుంది. పిట్లలవానిపాలెం, కర్లపాలెం ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలు యథేచ్ఛగా నడుస్తున్నాయి. వేమూరు నియోజకవర్గంలో కృష్ణానది నుంచి నిత్యం అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. పేకాట, కోడిపందేలు జోరందుకున్నాయి. ఇక్కడ మట్టివ్యాపారం సైతం పచ్చనేతలకు కాసులు కురిపిస్తోంది.

విజృంభిస్తున్న రేషన్ మాఫియా..

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలో రేషన్ మాఫియా విజృంభిస్తోంది. ఇటీవల వందల టన్నుల చౌకబియ్యాన్ని ఇక్కడే అధికారులు పట్టుకున్నారు. చీరాల, పర్చూరు, బాపట్ల నియోజకర్గాలతోపాటు అన్ని ప్రాంతాలనుంచి రేషన్ బియ్యాన్ని ఇతరప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. రేషన్ డీలర్లకు చేరకుండానే బియ్యం ప్రభుత్వ గోదాములనుంచి నేరుగా మాఫియాకు చేరుతోంది. బియ్యం కావాలని అడిగితే రేషన్ కార్డులు రద్దు చేయిస్తామని పచ్చనేతలు బెదిరిస్తున్నారు.

బెల్టుషాపులు.. కోడిపందేలు

మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో పేకాట, కోడిపందేలు జోరుగా నడుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా బెల్టు షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. గ్రామగ్రామాన ఇప్పటికే షాపులు పెట్టారు. బెల్టు షాపులకు రూ. 50 వేల నుంచి లక్ష వరకు డిపాజిట్లు వసూలు చేస్తున్నారు. మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు తమకేమీ పట్టనట్లు మిన్నకుండి పోయారు. కూటమి పాలనలో జిల్లాలో అభివృద్ధి సంగతి దేవుడెరుగు టీడీపీ నేతల అవినీతికి అడ్డు అదుపూ లేకుండా పోయిందని ప్రజలు బహిరంగంగా చెప్పుకొంటున్నారు.

ఇన్‌చార్జి మంత్రి వద్ద పంచాయితీ

జిల్లా టీడీపీలో ఇంటిపోరుతోపాటు నేతల అవినీతి, అక్రమాల వ్యవహారం జిల్లాకు చెందిన మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా అటువంటివారిని మందలించాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం. పరిస్థితి చక్కదిద్దాలని అధిష్టానం ఇన్‌చార్జి మంత్రికి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. మంగళవారం బాపట్ల జిల్లాసమీక్ష మండలి సమా వేశానికి వస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారధి పొలిటికల్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో ఆయన జిల్లాలో నేతల అక్రమాలు, విభేదాలపై పంచాయితీ పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా నేతల అక్రమాలు, అవినీతి చిట్టాను పట్టుకొస్తున్న ఇన్‌చార్జి మంత్రి తొలుత జిల్లా కలెక్టర్ తోనూ సమావేశమై నేతల వ్యవహారాలను ఆరా తీయనున్నట్లు సమాచారం. కలెక్టర్ ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌ను తీసుకొని ఆ తర్వాత ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.

పచ్చనేతల దోపిడీ ఇలా....



పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు నుంచి రోజూ రూ.కోట్ల గ్రానైట్ పలకలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తెలంగాణ తోపాటు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. మార్టూరు, ఇంకొల్లు ప్రాంతాలనుంచి నిత్యం గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. చినగంజాం, కడవకుదురు ప్రాంతాలనుంచి జిల్లాతోపాటు తెలంగాణకు ఇసుకను తరలిస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములనుంచి ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. సముద్ర తీరప్రాంతాన్ని వదలక టోల్‌గేట్లు పెట్టి పర్యాటకులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అసైన్డ్ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేసి అమ్మేస్తున్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో వంచన..

- అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ పోయి రబీ నడికొస్తున్నా జిల్లాలోని 1,92,037 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ. 384,06 కోట్లలో పైసా ఇవ్వలేదు.
- తల్లికి వందన పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు. జిల్లాలోని 2,35,654 మందికి రూ. 353.48 కోట్లు ఇవ్వాల్సిఉన్నా ఒక్క రూపాయి అందించలేదు.
- నెలకు రూ. 3 వేలు నిరుద్యోగభృతి అన్నారు. జిల్లాలో 4,77,557 కుటుంబాల పరిధిలో ఇంటికొక్కరు అనుకున్నా వారందరికి చెల్లించాల్సిన రూ. 143.26 కోట్లలో పైసా ఇవ్వలేదు.
- మహిళలకు ప్రతినెల రూ. 1500 ఇస్తామన్నారు. జిల్లాలో 19 నుంచి 59 ఏళ్ల వయస్సు వారు 6,61,841 మంది ఉండగా వీరందకి ఏడాదికి రూ. 11,913 కోట్లు ఇవ్వాల్సిఉన్నా దాని ఊసే మరిచారు.
- ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లు అన్నారు. జిల్లాలో మొత్తం 4,60,836 గ్యాస్ కనెక్షన్‌లు ఉండగా మూడు ఉచిత సిలిండర్లకు ఒక్కొక్కరికి రూ. 2,700 చొప్పున ఇవ్వాల్సివుంది. కానీ ప్రభుత్వం 3 లక్షల మందిని మాత్రమే లబ్ధి దారులుగా ఎంపిక చేసి చేతులు దులుపుకుంది.
- మహిళలందరికీ ఉచితబస్సు ప్రయాణమన్నారు. జిల్లాలో ఉన్న ఆర్టీసీ బస్సుల ప్రకారం రోజూ 90 వేలమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన 66 హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. జిల్లాలో అభివృద్ధిని పట్టించుకోలేదు.

న్యూస్‌రీల్

డిసెంబర్ 31 నాటికి గృహాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన గృహాలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవై ద్వారా హౌసింగ్ లేఅవుట్స్‌లో సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల ప్రస్తుత పరిస్థితిని అధికారులు సమీక్షించాలన్నారు. రూఫ్ లెవెల్‌లో ఉన్న ఇళ్లు పూర్తయ్యేలా, స్టేజ్ అప్డేషన్ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. గృహాలపై సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు అపార్ ఐడీలను త్వరగా ప్రారంభించాలని పేర్కొన్నారు. పల్లె పండుగలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, డ్వామా పీడీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి జీపీడీపీ శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో 2025–26 వార్షిక ప్రణాళిక రూపకల్పనపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారుల తోపాటు పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రణాళిక ఉద్యమం 2025–26లో భాగంగా గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి, జిల్లా పంచాయతీ, జిల్లా ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర కార్యాచరణ తయారీకి ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈనెల 5,6వ తేదీల్లో పల్నాడు, 7,8వ తేదీల్లో గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మండలాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు అధికారులు, ఉద్యోగులు హాజరు కావాలని సూచించారు.

40,989 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,989 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,381 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,765 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్ చేసేందుకు ఐటీఐ అభ్యర్థులు ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి.నీలిమ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దీనికి అర్హులన్నారు. వీరందరూ జిల్లాల వారీగా www.aprenticerhipindia.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్కులు, సీనియార్టీ ప్రకారం ఎంపికలు జరుగుతాయన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 140 అర్జీలు



అర్జీలు పరిశీలించి, సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్

బాపట్ల: ప్రజల సమస్యలను పరిష్కరించడంపై అధికారులు అధిక ప్రాధాన్య ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తన పరిధిలోని వాటికి జిల్లా కలెక్టర్ సత్వరమే పరిష్కార మార్గం చూపుగా, కొన్నింటిని పరిశీలనకు, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులకు పంపారు. మిగిలినవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ, డీఆర్‌డీఏ, పోలీస్, మార్కెటింగ్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించి 140 అర్జీలు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని, నిర్లిప్తంగా ఉండే చర్యలు తప్పవన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేటలో విగ్రహ రాజకీయం

- వైద్యశాలలో మాజీ స్పీకర్ కోడెల విగ్రహం ఏర్పాటు
- ఎమ్మెల్యే అరవిందబాబు ఆదేశాలతో తొలగింపు
- యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోడెల వర్గం బెదిరింపులు
- రెండు వర్గాల మధ్య నలిగిపోతున్న వైద్యాధికారులు



ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచిన కోడెల విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఆయన అనుచరులు

నరసరావుపేటటౌన్: కరవమంటే కప్పకు కోపం.. విడవ మంటే పాముకు కోపం.. అన్న చందంగా తయారైంది నరసరావుపేట వైద్యాధికారుల పరిస్థితి. తెలుగుదేశం పార్టీ గ్రూప్ రాజకీయాలు అధికారులకు తలనొప్పిగా మారాయి. అనుమతులు లేని మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల విగ్రహం తొలగించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇచ్చిన ఆదేశాలతో అధికారులు తొలగించారు. తిరిగి యథాస్థానంలో విగ్రహం ఏర్పాటు చేయకుంటే అధికారులను సస్పెండ్ చేయిస్తామంటూ కోడెల వర్గం బెదిరింపులకు దిగింది. దీంతో రెండు వర్గాల అంతర్గత పోరుతో వైద్యశాఖ అధికారులు సతమతమవుతున్నారు. వివరాల్లోకెళితే.. లింగంగుంట్ల ప్రాంతంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని రెండు నెలల క్రితం ఆయన అభిమానులు ఏర్పాటు చేశారు. అనుమతులు లేని కారణంగా విగ్రహాన్ని ప్రారంభించలేదు. ఈ క్రమంలో వారంరోజుల క్రితం విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించిన వైద్యాధికారులు కార్యాలయంలో భద్రపరిచారు. ఈ వ్యవహారంపై కోడెల వర్గీయులు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్‌ను ఆయన కార్యాలయంలో నిర్బంధించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకే విగ్రహాన్ని తొలగించామని సూపరింటెండెంట్ ఆ సమయంలో తెలిపారు. విగ్రహ ఏర్పాటుపై ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా సానుకూలంగా స్పందించి కోడెల విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో కోడెల వర్గంగా పేరొందిన సుమారు 20 మంది ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం చేరుకున్నారు. తొలగించిన తమ నాయకుడు కోడెల విగ్రహం కాల్వలో పడేశారన్న అనుమానం తమకు ఉందని ఎక్కడ ఉందో చూపించాలని వైద్యశాల ఆర్ఎంఓ ఏడుకొండలను ప్రశ్నించారు. కార్యాలయంలో భద్రపరిచిన విగ్రహాన్ని సిబ్బంది వారికి చూపించారు. దీంతో అక్కడ ఉన్న అధికారులను ఉద్దేశించి బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. రెండు రోజుల వ్యవధిలో తొలగించిన స్థానంలో యథావిధిగా కోడెల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లేకుంటే సూపరింటెండెంట్‌తో పాటు సిబ్బందిను సస్పెండ్ చేయిస్తామని బెదిరించారు.

తలనొప్పిగా మారిన విగ్రహ రాజకీయం..

వైద్యశాలలో అనుమతులు లేని కోడెల విగ్రహాన్ని తొలగించాలని ఎమ్మెల్యే.. విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని కోడెల వర్గం.. ఇలా రెండు వర్గాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తుండటం అధికారులకు తలనొప్పిగా మారింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు తనయుడు డాక్టర్ కోడెల శివరామ్ వర్గాల మధ్య విభేదాలు ఉన్నాయి. అరవిందబాబుతో కలిసి శివరామ్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. రెండు వర్గాలు ఎవరికివారే అధికార పార్టీ నాయకుల్లా నియోజకవర్గంలో చలామణి అవుతున్నారు.

సోషల్ మీడియాపై కాలకూటమి



పచ్చ బ్యాచ్ 'ఎర్ర' వేషాలు

- వేధించడమే లక్ష్యం?
- పోస్టులు పెడుతున్నారంటూ కేసులు
- వైఎస్సార్ సీపీకి అండగా ఉన్న వారే టార్గెట్
- 2018లో పోస్ట్ పెట్టాడంటూ ఆళ్ల జగదీశ్ రెడ్డి అరెస్ట్...
- మహిళా కార్యకర్తలనూ వదలని వైనం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూటమి అరాచకం



పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వ అవినీతిని, హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం వేధింపులకు దిగింది. అరెస్టులు చేసి కేసులు పెడుతూ, స్టేషన్‌కు పిలిచి బెదిరింపులకు దిగుతోంది. రెండు రోజులుగా సోషల్‌మీడియా కార్యకర్తలే టార్గెట్‌గా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. సుప్రీంకోర్టు నిబంధనలనూ ఉల్లంఘిస్తూ, అర్ధరాత్రి వేళ కనీసం ఎక్కడికి తీసుకెళ్తున్నారన్న విషయాన్ని కుటుంబ సభ్యులకూ చెప్పకుండా తరలిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకులతో మాట్లాడుకోవాలని, లేకపోతే ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ పోలీసులే కూటమి ప్రభుత్వం తరఫున బెదిరింపులకు దిగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పల్నాడు జిల్లాలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. సోషల్‌మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయపోరాటానికి సన్నద్ధం అయ్యింది. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇస్తోంది.

ఇవిగో నిదర్శనాలు

సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేకా వెంకటరామిరెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చారు.



పోలీస్‌స్టేషన్ వద్ద వెంకటరామిరెడ్డి

- ఈ నెల 2న వైఎస్సార్ సీపీ నాయకురాలు పాలేటి కృష్ణవేణిని పోస్టులు పెట్టారని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా ఆమెకు బెయిల్ లభించింది. ఆమెపై పోలీసు స్టేషన్ వద్ద, కోర్టు వద్ద దాడికి తెలుగు మహిళలు యత్నించారు. గతంలో కృష్ణవేణి భర్త రాజకుమార్‌ను తెలుగుదేశం నాయకులు కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టారు. లోకేష్ చిత్రపటం వద్ద మోకాళ్లపై నిలబెట్టి దానికి దండం పెట్టించి క్షమాపణలు చెప్పించారు. అప్పటి నుంచి ఆ కుటుంబాన్ని తెలుగుదేశం నేతలు వేధిస్తూనే ఉన్నారు.
- తెనాలి నియోజవర్గం కొల్లిపర మండలం వల్లభాపురం చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, రైతు ఆళ్ళ జగదీష్ రెడ్డిపై కేసు మరీ విచిత్రంగా ఉంది. 2018లో పవన్‌కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌పై పోస్టు పెట్టారని రెండురోజుల క్రితం విజయవాడ సైబర్ క్రైమ్ సిటీ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేసి తీసుకువెళ్లారు. రెండురోజులైనా కోర్టులో హాజరుపరచకపోవడంతో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రంగంలోకి దిగింది. దీంతో దిగొచ్చిన పోలీసులు ఆయనను వదిలిపెట్టారు.
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి మీద సోషల్ మీడియా కేసు నమోదైంది. లోకేష్ చంద్రబాబు కుటుంబంపై పోస్ట్ చేసినందుకు టీడీపీ తాడికొండ మండలం మోతడక గ్రామ పార్టీ అధ్యక్షుడు రావి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ నాయకుడు బండారు జయకుమార్‌పై చిలకలూరిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆధారాలు లభించకపోవడంతో కారుమూరి రాంబాబు అనే అతని వద్ద రూ.రెండు లక్షలు తీసుకొని డబ్బులు ఎగ్గొట్టి అతనిపై దాడి చేశాడంటూ తప్పుడు కేసు పెట్టారు.
- చిలకలూరిపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్చార్జి దొడ్డ రాకేష్ గాంధీని టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అప్పటి నుంచి అతను అజ్ఞాతంలోనే ఉండాల్సి వచ్చింది.
- సత్తెనపల్లి రూరల్ మండలంకు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కో–ఆర్డినేటర్ మద్రి శివప్రసాద్‌కు ఇటీవల టీడీపీ నేతల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. గుంటూరు నుంచి టీడీపీ సోషల్ మీడియా విభాగానికి చెందిన వారు ఫోన్ చేసి మీరు ఏమేమి పోస్టులు పెట్టారో అన్నీ తమ దగ్గర ఉన్నాయని, మళ్లీ పోస్టు పెడితే జైలు ఊచలు లెక్కించక తప్పదంటూ బెదిరించారు.
- డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై వినుకొండ మండలం పానకాలపాలెం గ్రామ నివాసి అయిన నన్నపనేని వెంకట్రావు అనుచిత పోస్టుపెట్టాడని జనసేన నేత నిశంకర శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ సీఐ కేసు నమోదు చేశారు. ఆదివారం వెంకట్రావును అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.
- మాచర్ల రూరల్ కంభంపాడు గ్రామానికి చెందిన నెమలి దిన్నె రంగారెడ్డి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ కేసు నమోదు చేశారు.
- గురజాల మండలం తేలుకుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పప్పుల వెంకటరామిరెడ్డిని సోమవారం పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి గురజాలకు తీసుకువచ్చారు. పవన్ కళ్యాణ్‌పై అనుచిత వాఖ్యలు చేశారని, అందుకే అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 15న గురజాల నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వెన్నా రాజశేఖర్‌రెడ్డిని, పిడుగురాళ్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మాబులనూ పోలీసులు అరెస్టు చేశారు.

గతంలో సోషల్ మీడియా కార్యకర్తపై హత్యాయత్నం

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త, సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మట్టుపల్లి ఏసుబాబు (మోజెస్)పై నందిగామ అడ్డరోడ్డులో జూలై 24న రాత్రి హత్యాయత్నం జరిగింది. స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై మోజెస్ వెళ్తుండగా ఆరుగురు టీడీపీ గుండాలు పథకం ప్రకారం వచ్చి కర్రతలతో దాడి చేశారు. 'కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి అండ చూసుకొని కన్నా లక్ష్మీనారాయణపైనే ఎన్నికలకు ముందు పోస్టులు పెడతావా? ఇప్పుడు నిన్ను చంపితే ఎవడొస్తాడో ఇప్పుడు రమ్మను? చూద్దాం' అంటూ కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయ పరిచారు. అప్రమత్తమైన స్థానికులు మోజెస్‌ను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాణాలతో బయటపడ్డాడు.

క్లుప్తంగా

వ్యవసాయ కూలీల ఆటో బోల్తా

నలుగురికి తీవ్రగాయాలు

చీరాల: వ్యవసాయ కూలి పనుల నిమిత్తం వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదం మంగళవారం చీరాల – కారంచేడు రోడ్డులో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. స్థానిక విజయనగర్ కాలనీ నుంచి కారంచేడు సమీపంలోని చిట్టివాద పొలం పనులకు వ్యవసాయ కూలీలతో ఆటో బయలుదేరింది. ఆటో కారంచేడు సమీపంలోకి వచ్చేసరికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో పది మంది కూలీలుండగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆది ఆంధ్రా సొసైటీ పాలకవర్గం రద్దు

ప్రత్యేక అధికారిని నియమించిన కో–ఆపరేటివ్ అధికారి

బాపట్ల: దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్రా సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సీహెచ్ శాంసన్ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఆదిఆంధ్రా సొసైటీ భూములకు నష్టపరిహారం చెల్లించగా వాటిని పాలకవర్గంతోపాటు సభ్యులు వ్యక్తిగతంగా వాడుకోవటంపై విచారణ చేపట్టారు. సొసైటీకి సంబంధించిన నిధులను వ్యక్తిగతంగా వాడుకోవటం నిబంధనలకు విరుద్ధం కావటంతో సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సొసైటీకి ప్రత్యేక అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.చంద్రకుమార్ నియమించినట్లు తెలిపారు. పాలకవర్గానికి సంబంధించిన బాధ్యతలు పూర్తిస్థాయిలతో పరిశీలిస్తారని చెప్పారు.

ఏఎం రెడ్డి కళాశాలలో వాలీబాల్ పోటీలు

నరసరావుపేటరూరల్: పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి ఏడు కళాశాలల జట్లు పోటీలో పాల్గొన్నాయి. పోటీలను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన పోటీలలో ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాల (జొన్నలగడ్డ) విన్నర్‌గా, విక్టోరియా కళాశాల (పేరేచర్ల) జట్లు రన్నర్‌గా నిలిచాయి.

పవన్ వ్యాఖ్యలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

- మాదకద్రవ్యాలు నిజమే అంటున్న హోం మినిస్టర్ అనిత
- సూపర్ సిక్స్ హామీలన్నీ ఇసుకపై రాతలే
- కులాలను చూసి నిందితులను వదిలేయటం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి

మార్టూరు: రాష్ట్రంలోని మూడు పార్టీల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన మూడెడ్ల బండి సవారీలా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. ఒంగోలు నుంచి తాడేపల్లి వెళుతూ మంగళవారం మధ్యాహ్నం ఆయన మార్టూరులో మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యం జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురంలో చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తాను హోం మినిస్టర్ పదవి తీసుకుంటే మరోలా ఉంటుందని హోం మినిస్టర్ అనిత, ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తమ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రత్యక్షంగా ఒప్పుకోవటం కాదా? అని ఆయన ప్రశ్నించారు. మహిళలను అత్యాచారం చేసి అంతమొందిస్తున్న నిందితులను కులం చూసి వదిలేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శమని ఆయన ఎద్దేవా చేశారు. తాను హోం మినిస్టర్ పదవి తీసుకొని గబ్బర్ సింగ్ సినిమాలోని హీరోలా తుపాకీతో వ్యవస్థను గాడిలో పెట్టాలని పవన్ కళ్యాణ్ కలలు కంటున్నారన్నారు. ప్రజారక్షణకు అవసరమైన యంత్రాంగాన్ని, సిబ్బందిని నియమించకుండా పోలీసులను, అధికారులను పవన్ కళ్యాణ్ విమర్శించడం వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటమేనని అన్నారు.

రబీ సీజన్ దాటుతున్నా సాయమేది?

రబీ సీజన్ దాటుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ ఏమైందని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పొరుగు రాష్ట్రాల పరిశీలనకే పరిమితమైందని బత్తుల విమర్శించారు. ఇసుక, లిక్కర్ పాలసీలు లోపభూయిష్టంగా ఉన్నాయని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ పథకం ప్రకారం ముస్లిం సమాజాన్ని వివక్షకు గురిచేస్తూ వక్ఫ్ ఆస్తుల సవరణ చట్టం 2024 ప్రవేశపెట్టారని, దానిపై టీడీపీ, జనసేన నేతలు తమ వైఖరి ఏమిటో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్న నాయకులు తాము మాట్లాడే మాటలు ప్రజలకు భరోసా ఇవ్వాలే కానీ ఆత్మ రక్షణలో పడేలా ఉండకూడదని బత్తుల హితవు పలికారు.

డైవర్షన్ పాలిటిక్స్ బాబుకు అలవాటే..

రాష్ట్రంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, అత్యాచారాలు నిజమేనని సాక్షాత్తు హోం మినిస్టర్ ఒప్పుకోవడం చూస్తుంటే ఆమె నిస్సహాయ స్థితికి అద్దం పడుతుందని అన్నారు. బయటకు వస్తే ప్రజలు తమను తిడుతున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్న మాటలు ప్రభుత్వ పాలనా దక్షతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఒకపక్క డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ పాలనా వైఫల్యాలను ఒప్పుకుంటుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం తమ వైఫల్యాలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన పార్టీ కారణమంటూ విమర్శించటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇసుకపై రాతలనే విషయం చంద్రబాబుకు తెలుసని, అందుకే ఆయన డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని బత్తుల విమర్శించారు.

పోలీసులతో కలిసి టీడీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు

రక్షణ కల్పించాలని డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: టీడీపీ నాయకులు పోలీసులతో కలసి తమను హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావులు మంగళవారం తాడేపల్లిలోని డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, ఎస్ఐ శివయ్యతో సోమవారం రాత్రి సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు బాధితులు ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పోలీస్ అధికారులు, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా నుంచి తమకు తగు రక్షణ కల్పించాలని బాధితులు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

కర్లపాలెం: బాపట్ల జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. కర్లపాలెం మండలం యాజలి సెంటర్‌లోని 216 జాతీయ రహదారి వద్ద నుంచి పిట్టలవానిపాలెం మండలంలోని పుచ్చకుర్తివారిపాలెంలో నుంచి ఖాజీపాలెం వరకు గల 6కిలో మీటర్ల పొడవు ఉన్న రహదారికి రూ.39లక్షలతో మరమ్మతు పనులను ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారధి, జిల్లా మంత్రి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళీతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారధి మాట్లాడుతూ సముద్రతీర ప్రాంతాన ఉన్న బాపట్ల జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గుంతలు లేని రహదారులే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు సుమారు 826 వేల కోట్లు రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న 2,200 మందికి పనిముట్లు, ప్రాథమిక వైద్య కిట్లు అందజేయటానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ గీతారాణి, డీపీఓ ప్రభాకర్, ఆర్డీఓ పి.గ్లోరియా, వేగేశన రాకేష్‌వర్మ, అధికారులు పాల్గొన్నారు.

తలసరి ఆదాయం పెంపునకు కృషి..

బాపట్ల: ప్రజల తలసరి ఆదాయం రూ.4 లక్షలకు పెంచడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్లకు తొలిసారిగా వచ్చిన ఆయన మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని తెలిపారు.

జనవరికి కొత్త అక్రిడిటేషన్లు ఇస్తాం

బాపట్ల: రాష్ట్రంలోని జర్నలిస్టులకు జనవరిలో కొత్త అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చి తీరుతామని రాష్ట్ర పౌర సమాచార శాఖ మంత్రి పార్థసారధి వెల్లడించారు. మంగళవారం బాపట్లకు వచ్చిన ఆయనను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసింది. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఐలవరం(భట్టిప్రోలు): ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నెల్లూరు జిల్లా దర్గామిట్టా బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఏ యోగా పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుచున్న కె.సంపత్ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. డిసెంబర్ 8 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన సంపత్‌ను, శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరెడ్డిని హెచ్ఎం ఎం.మోహన్ రావు, ఉపాధ్యాయులు బదరీనాథ్‌లు అభినందించారు.

భద్రత చర్యలతో క్వారీల్లో ప్రమాదాలకు చెక్

క్వారీలను తనిఖీ చేసిన ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా బృంద సభ్యులు



ఎస్ఆర్ క్వారీలో జెండా ఆవిష్కరించి, భద్రత చర్యలు వివరిస్తున్న బృంద సభ్యులు

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో భద్రత చర్యలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా బృంద సభ్యులు లీలారామ్, రామకృష్ణ తెలిపారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ ఇంపీరియల్, ఎస్ఆర్, సాయి స్టోన్స్, కె.శ్రీనివాసరావు క్వారీలను టీమ్ పరిశీలించారు. ఆయా క్వారీల్లో రికార్డులు, ఎంతమంది పనిచేస్తున్నారు. భద్రతా చర్యలు, కార్మికులు పనిచేసే ప్రదేశాలు, పొందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయా క్వారీల్లో జెండా ఆవిష్కరణతో కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించి భద్రతా చర్యలను వివరించారు. క్వారీలో నూరుశాతం భద్రత చర్యలు పాటించిన క్వారీలకు వారోత్సవాల ముగింపులో బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో మేనేజర్లు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు వెంటనే రద్దుచేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



మహాసభలో మాట్లాడుతున్న గంగయ్య

జె.పంగులూరు: రాష్ట్ర ప్రజానీకంపై అధిక విద్యుత్ భారాలు మోపేందుకు అమలు చేస్తున్న విద్యుత్ ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. పంగులూరు మండల సీపీఎం మూడో మహాసభలు మంగళవారం పంగులూరులోని సరికొండ అంజమ్ రాజు, సారి కుక్క ఏసోబు నగర్ (రోటరీ భవనం)లో జరిగింది. కార్యక్రమానికి సీనియర్ నాయకుడు మానం హరిబాబు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా గంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, 70 శాతంగా ఉన్న కౌలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తున్న మద్యం బెల్ట్ షాపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రజలు మద్యం బారిన పడకుండా చూడాలని సీపీఎం మండల మహాసభ తీర్మానించింది.

బీజేపీకి సాగిలపడిన చంద్రబాబు..

సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాజధానికి రావాల్సిన హక్కులు సాధించాల్సింది పోయి బీజేపీకి సాగిలపడ్డాడన్నారు. ఫలితంగా పోలవరం, రైల్వేజోన్, రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, రాజధాని నిధులు, ప్రత్యేక హోదా తీసుకురావటంలో చంద్రబాబు పూర్తిగా విఫలం అయ్యాడన్నారు. అనంతరం సీపీఎం పంగులూరు మండల కన్వీనర్‌గా తలపనేని రామారావును ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా రాయిని కృష్ణకుమారి, పాలపర్తి ఏలియా, మానం హరిబాబు, పూసపాటి సుబ్బరాజు, నాయపాము ప్రభాకర్‌లను ఎంపిక చేశారు.

హైకోర్టు ఏజీపీగా ఆనందరావు



పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది తాడిశెట్టి వెంకట ఆనందరావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టు సెక్షన్ అధికారి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గుంటూరులో ఆయన న్యాయవిద్య అభ్యసించి, ప్రాక్టీస్ నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పొన్నూరు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఆధ్వర్యంలో డీఎస్సీ–2024 ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 11వ తేదీలోగా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 మంది అభ్యర్థులకు 2నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తామని వివరించారు. ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను టీటీసీ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ (రూ.ఒక లక్ష లోపు), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫొటోలు జత పరచాలన్నారు. వివరాలకు 9010497267 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

జీబీసీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ముప్పాళ్ల: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువలోని లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం మంగళవారం గుర్తించారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు పైబడి ఉంటాయని, కాల్వలో పడి సుమారు నాలుగు రోజుల పైబడి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా ఉబ్బి కుళ్లిపోయి ఉంది. బోర్లా ఉండటంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి జేసీబీతో మృతదేహాన్ని బయటకు తీశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల నుంచి వైద్యుడిని పిలిపించి అక్కడే శవపంచనామా నిర్వహించి, సమీపంలోనే పూడ్చి వేశారు. నాలుగు రోజుల కిందట వృద్ధులు ఎవరైనా కనిపించకుండా పోయిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, మృతదేహం పై ఎలాంటి దుస్తులు లేవని, కుడి చేతికి మాత్రం రాగి కడియం ఉందని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు.

ఏఎన్‌యూ అధ్యాపకుడి పరిశోధనకు పేటెంట్



ఏఎన్‌యూ: గోదావరిలో లభించే పొలస చేపలలో ఉండే పోషక పదార్థాలపై చేసిన పరిశోధనకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ అధ్యాపకుడు ఆచార్య పీవీ కృష్ణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాలయం నుంచి పత్రం ఆయనకు అందింది. వర్సిటీలో మంగళవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు నుంచి ఆ పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పేటెంట్ రావడం గర్వకారణమన్నారు. ఆచార్య పీవీ కృష్ణ మాట్లాడుతూ.. పులస చేపలలో ప్రోటీన్లు, సాచ్యురేటెడ్, అన్‌సాచ్యురేటెడ్ ఆమ్లాలలో అతి ముఖ్యమైన డోకోస హెక్సయినోయిక్ (డీహెచ్ఏ), ఐకోసపెంటయినోయిక్ (ఈపీఏ) ఆమ్లాల మీద పరిశోధన చేశానన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జియాలజీ విభాగాధిపతి ఆచార్య పీజే రత్నాకర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు ఆయన్ను అభినందించారు.

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

మంగళగిరి: నవులూరు ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి 9వ తేదీ వరకు కుచ్ బెహార్ అండర్ –14 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌లను ఉదయం 8.30 గంటలకు ఏసీఏ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు..

కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



కొల్లూరు(వేమూరు): కొబ్బరి చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి మృత్యువాత పడి ఘటన కొల్లూరు మండలం తిప్పలకట్ట గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన పైనం రాంబాబు (49) కొల్లూరు మండలంలోని తిప్పలకట్ట గ్రామంలో కొబ్బరి తోటలోని కొబ్బరి చెట్టు ఎక్కి బొండాలు కోస్తుండగా మోకు జారటంతో చెట్టుపై నుంచి కిందపడి చనిపోయాడని కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పంపించామని ఆయన తెలిపారు.

అపార్ నమోదులో సమస్యలను పరిష్కరించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ నమోదులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (అప్సా) రాష్ట్ర కో–కన్వీనర్ మేకల రవీంద్రబాబు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకను అప్సా ప్రతినిధులు కలిశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అప్సా ప్రతినిధులు మాట్లాడుతూ.. అపార్ కోసం విద్యార్థుల వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూడైజ్ ప్లస్, ఆధార్‌లోని వివరాలు సరిపోలకపోవడంతో నమోదు కావడం లేదని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పుల సవరణకు విద్యార్థులు ఆయా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని డీఈవోకు వివరించారు. అపార్ అప్‌లోడింగ్‌కు గడువు పెంచాలని కోరారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఆదివారాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఈవో రేణుక స్పందిస్తూ.. ఆధార్ సవరణల కోసం గుంటూరు నగరంలో అదనపు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాసరావు, ఏవీ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహనరావు, డివిజన్ అధ్యక్షులు నర్రా రాజేష్, భాను ప్రసాద్, నాయకులు మాదా శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, పాశం శ్రీనివాసరావు ఉన్నారు.

దోపిడీ కేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, వెనుక నిందితుడు

అమర్తలూరు: బెదిరించి నగదు, ఫోన్ లాక్కున్న ఘటనలో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని చుండూరు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అమర్తలూరు పోలీసు స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు.. బాపట్ల పట్టణంలోని బేతనీ కాలనీకి చెందిన జానా సంసోన్ గతనెల 14వ తేదీన తన అత్తగారి ఊరైన ప్రకాశం జిల్లా రాచర్ల మండలం, ఆకువీడు గ్రామానికి వెళ్లేందుకు తెల్లవారుజామున 4 గంటలకు బస్టాండ్ వద్ద నిలిచి ఉన్నాడు. ఈక్రమంలో కారులో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు బస్టాండ్ దగ్గరకు వచ్చి గుంటూరు వరకు వెళుతున్నామని చెప్పి కారు ఎక్కించుకున్నారు. పొన్నూరు నుంచి దారి మళ్లించి ఇంటూరు వైపునకు తీసుకెళ్లి, సంసోను కొట్టి, బెదిరించి అతని వద్ద ఉన్న రూ.10 వేలు నగదు, ఫోన్ తీసుకొని చందోలు బైపాస్ వద్ద వదిలి వెళ్లి పోయారు. ఈమేరకు బాధితుడు అమర్తలూరు పోలీసు స్టేషనుల్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, దర్యాప్తు చేసి నలుగురు నిందితుల్లో ఒకడైన తురిమెళ్ల శ్యారను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. మిగిలిన ముగ్గురిని సైతం త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ అండర్-14 బాలుర రాష్ట్ర జట్టు క్రీడాకారులు

- అండర్–14 విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం
- అండర్–14 బాల బాలికల రాష్ట్ర జట్లు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్–14 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం సాధించగా, కృష్ణా, విశాఖ జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ, అనంతపురం ద్వితీయ, కృష్ణా జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనే అండర్–14 బాల బాలికల రాష్ట్ర జట్టును సోమవారం రాత్రి స్కూల్ గేమ్స్ పల్నాడుజిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మూడురోజులుగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్ జిల్లాల అండర్–14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలలో భాగంగా రాష్ట్ర జట్లు ఎంపిక నిర్వహించారు.

అండర్–14 బాలుర విభాగంలో వి.సుశ్రిత్, ఎస్.శ్రీచరణ్, కె.త్రిశాల్ (తూర్పుగోదావరి), ఈ.కౌశిక్, ఎం.సంతోష్ (అనంతపురం), ఈ.చార్లెస్‌వెస్లీ (పశ్చిమ గోదావరి), జి.జగదీష్, వి.కేతన్‌సాయి (కృష్ణా), కె.జైరామ్ (విశాఖ), పి.జీవన్ (కర్నూల్), కె.సాయిసంతోష్ (చిత్తూరు), కె.కార్తికేయ (నెల్లూరు).

అండర్–14 బాలికల విభాగంలో సిహెచ్.ఐశ్వర్యాంబిక, బిఎస్ఆర్ మాధురి, సిహెచ్.భువనేశ్వరి (తూర్పుగోదావరి), బి.కుసుమ, ఆర్.వాహిని (కృష్ణా), జి.శాస్య, కె.అమూక్త (విశాఖ), యోగశ్రీ (పశ్చిమగోదావరి), ఎస్.సాయిశ్రీ (గుంటూరు), రిషిత (చిత్తూరు), శ్రీజా (అనంతపురం), ఎస్.ముస్కాన్ (కర్నూలు).